రేషన్ బియ్యం దందా..!

యథేచ్ఛగా అక్రమ రవాణా
కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలింపు
ఏటా 3 వేల నుంచి 4 వేల క్వింటాళ్లు..
విజిలెన్స్ దాడులు చేస్తున్నా.. ఆగని వైనం


బియ్యం రవాణా వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అనంతపురం క్రైం, జూలై13(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ రైస్' పుష్పరాజ్‌లు రెచ్చిపోతున్నా రు. అక్రమ మార్గాల్లో సబ్సిడీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటిం చేస్తున్నారు. ఏటా 3 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. విజిలెన్స్ దాడుల్లో దొరికిపో తున్నా.. దందా మాత్రం ఆగట్లేదు. గతేడాది 2,745 క్వింటాళ్ల బియ్యం విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడితే.. ఈ ఏడాది మూణ్నెళ్లలోనే వెయ్యి క్వింటాళ్లకుపైగా సీజ్ చేశారు. ఈ లెక్కన చూస్తుంటే.. బియ్యం అక్రమ రవాణా ఏస్థా యిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

అధిక ధరల ఆశ చూపి..

ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్య అందిస్తోంది. పేదలు, సామా న్యులు మూడుపూటలా తిండికి ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో పంపిణీ చేస్తోంది. బియ్యం స్మగ్లర్లు అధిక ధరలు ఇస్తా మంటూ పేదలకు వల విసురుతున్నారు. కిలో రూ.12, రూ.15, రూ.18 అంటూ ఆశ చూపి, సామాన్యుల (మిగతా 7లో...)

పేదల పేరుతో పక్కాగృహాలు మంజూరు

బిల్లులు కూడా స్వాహా

లబ్ధిదారులకే తెలియని దుస్థితి

సొంతింటికి నోచుకోక నిరుపేదల అవస్థలు

ఇంటి దొంగలు..!


చంద్రాయుని పల్లిలోని నారాయణప్ప పాత ఇల్లు



"ఈయన పేరు ఇడగొట్టు నారాయణప్ప, తనకల్లు మండలం చంద్రాయునిపల్లి వాసి. పెద్దలు కట్టించిన ఈ పాత ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. అది కూడా వర్షానికి తడుస్తుంటే, పైన ప్లాస్టిక్ పట్టలు వేసుకున్నాడు. నిరుపేద అయిన ఈయన ఇల్లు కట్టు కోవాలనుకున్నాడు. పక్కాగృహం మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను కోరాడు. పరిశీలించిన అధికారులు.. 'ఇదివరకే నీ పేరుతో ఇల్లు మంజూరైందనీ, ఆన్‌లైన్‌లో పేరు ఉందనీ, బిల్లులు కూడా విడుదలయ్యాయ'ని చెప్పారు. దీంతో నారాయణప్ప షాక్ తిన్నాడు. తన పేరుమీద తనకే తెలియకుండా ఇల్లు ఎలా మంజూర చేస్తారనీ, బిల్లు ఎలా చెల్లిస్తారని నిలదీశాడు. తామేమీ చేయలే మని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగాడు. ఇక, తనకు పక్కాగృహం మంజూరు కాదనీ, పాత ఇంట్లోనే కాలం వెళ్ల దీయాల్సి వస్తోందని వాపోతున్నాడు. పాత ఇల్లు కూలితే తమ పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నాడు. మండలంలో ఇలాంటి బాధితులు చాలామంది ఉన్నారు. పాలకులు, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు."

తనకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పక్కాగృ హాల్లో అంతులేని అక్రమాలకు పాల్పడ్డారు. ఏకంగా నిరుపేదలైన లబ్ధిదారులకే తెలియకుండా ఇళ్లు మంజూరు చేసి, బిల్లులు కూడా స్వాహా చేశారు. దీంతో ఎంతోమంది నిరుపేదలు పక్కాగృ హాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం 1, 2, 3 దశల్లో విచ్చలవిడిగా పక్కాగృహాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు తెలియకుండానే వారి పేరుమీద పక్కాగృహాల మంజూరు చేసి, బిల్లుల కూడా చెల్లించారు. ఎవ రికి చెల్లించారో అధికారులు కూడా చెప్పట్లేదు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) చేశాయి. దీంతో పక్కాగృహాలు మంజూ రైనా, బిల్లులు తీసుకున్న అందరి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత పాలకులు ఆఫ్‌లైన్‌లో ఇష్ట మొచ్చినట్లు మహిళాసంఘాలను అడ్డం పెట్టుకుని బిల్లులు దోచేశారు. నేడు నిరుపేదలు పక్కాగృ హాల కోసం దరఖాస్తు చేసుకుంటే మండలవ్యా ప్తంగా పరిశీలించిన అధికారులు వేల సంఖ్యలో లబ్ధిదారులకు తెలియకుండా బిల్లులు కాజేసినట్లు తెలుస్తోంది. తమ పేరుతో మంజూరైన పక్కాగృ హాలకు తమకు తెలియకుండానే ఎవరు బిల్లులు తీసుకున్నారో కూడా తెలియక నిరుపేదలు లబోది బోమంటున్నారు. ఓసారి పక్కాగృహం మంజూరై, బిల్లులు తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైతే అంతే సంగతులు. మళ్లీ (మిగతా 7లో...)

రైతుల సహనానికి

పరీక్ష...!

దిష్టిబొమ్మల్లా భూసార పరీక్షా కేంద్రాలు

- నిధులు కేటాయించని వైసీపీ ప్రభుత్వం
- 'అనంత'కు పరుగులు తీస్తున్న అన్నదాతలు


ధర్మవరంలో మూతపడిన భూసార పరీక్షాకేంద్రం

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకోవాలంటే రైతులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పేరుకు కేంద్రాలు ఉన్నా నిరుపయోగంగా మారాయి. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు తగిన మోతా దులో రసాయనాలు వినియోగించేందుకు భూసార, నీటి పరీక్షలు ఎంతో ముఖ్యం. అలాంటి భూసార పరీక్షలను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. భూసార పరీక్ష కేంద్రాలు మూతపడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతు న్నారు. సత్యసాయి జిల్లాలో మూడు చోట్ల పరీక్షా కేంద్రాలు ఉండగా.. అందులో ఒక్కటి కూడా పనిచేయలేదు. పండ్ల మొక్కలు, ఇతర పంటలు సాగుచేసే సమయంలో భూసార, నీటి నమూనా పరీక్షలు ఎంతో కీలకం. ఇక్కడ పరీక్షా కేంద్రాలు మూతపడటంతో వ్యయప్రయాసాలకోర్చి అనంత పురం జిల్లాలోని ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్, రబీ సీజ న్‌లలో రైతులు వివిధ రకాల పంటలు సాగుచేస్తుంటారు. మట్టిసాంద్రత, నీటిలో లవణ శాతం తెలుసుకోవాలంటే పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. కదిరి, పెనుకొండ, ధర్మవరం డివిజన్ కేంద్రాల్లో ఉన్న భూసార పరీక్షా కేంద్రా లు మూతపడి ఉన్నాయి. దీంతో తాము పలు ఇబ్బందులకు గురవుతున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా నీరు, మట్టి పరీక్షలు రైతు పొలాల్లోనే చేసి వాటి వివరాలు తెలియజే స్తామని ఎంతో ఆర్భాటంగా అవగాహన కార్యక్రమాలు (మిగతా 7లో...)


పూర్తయిన లైనింగ్ పనులు

తుది దశకు

మరమ్మతులు

రేపటికి హెచ్చెల్సీ పనులు పూర్తి
కర్ణాటక వాటా నీటి విడుదలతో పెరుగుతున్న ఒత్తిడి
సరిహద్దులోకి చేరుతున్న జలాలు

రాయదుర్గం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకా లువ మరమ్మతులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో రూ. 35 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి కానున్నాయి. కర్ణాటక తన వాటా నీటిని 10వ తేదీ నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసుకుంది. దీంతో ఆంధ్ర వాటా నీటిని కూడా విడుదల చేసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాలువలో చేసిన పనులకు సంబంధించిన వృథా మట్టి, రాళ్ల లాంటివి తొలగింపు ప్రక్రియ మాత్రమే మిగిలి ఉంటాయి. ఆంధ్ర సరి హద్దులో 105 కి.మీ. నుంచి హెచ్‌ఎల్‌ఎన్‌సీ పరిధిలో లైనింగ్, యూటీల నిర్మాణం, మట్టికట్టలు, హెడ్‌వాల్స్, బ్యాక్ ఫిల్లింగ్, మెకానికల్‌కు సంబంధించిన పనులను చేస్తున్నారు. అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి రేయింబవళ్లు పనులు ముగింపుదశకు తీసుకురావడంలో సఫలీకృతులవు తున్నారు. తుంగభద్ర జలాశయంలో 80 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యాన్ని కుదించడంతో ఇప్పటికే జలాశయం నుంచి నదికి జలాలను వదులుతు న్నారు. వృథాగా నదికి వెళుతున్న జలాల్లో సాధ్యమైనంత మేరకు హెచ్చెల్సీకి తీసుకునేందుకు అవకాశాలు ఉండేవి. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ ఆటంకాలు, గండ్లు, పైపింగ్‌లు పడతాయని ఆందోళన ఉండేది. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులను మంజూరు చేయిం చారు. ఇప్పటికే ఆంధ్ర సరిహద్దుకు హెచ్చెల్సీ జలాలు చేరు తుండడంతో ఆంధ్రవాటా నీటిని సాధ్యమైనంత త్వరగా తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. 15వ తేదీ నాటికి క్యూరింగ్ పూర్తి చేసి కాలువలో ఉన్న మట్టి, వ్యర్థాల తొలగింపును రెండు, మూడురోజులల్లో ముగించుకుని నీటిని తీసుకోవాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. 20వ తేదీలోపు ఆంధ్రవాటా నీరు తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కర్ణాటక తన వాటా నీటిని (మిగతా 7లో..)


నల్లచెరువుకు చేరిన జాసన్ సైకిల్ యాత్ర

సైకిల్‌పై యాత్ర

నల్లచెరువు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కొట్టాయంకు చెందిన జాసన్ సైకిల్‌పై భారతదేశ యాత్ర చేపట్టారు. స్వగ్రామం నుంచి కశ్మీర్ వరకు యాత్ర చేస్తున్నట్లు ఆయన తెలి పారు. ఆదివారం ఆయన సైకిల్ యాత్ర మండలా నికి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ.. స్వగామం నుంచి బయలుదేరి ఇప్పటికి 9 నెలలు అవుతోంద న్నారు. ఈ 9 నెలల్లో 14 రాష్ట్రాలు తిరిగానన్నారు. దేశమంతా తిరిగి ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్ర దాయాలు, వాతావరణ పరిస్థితులు, ప్రాంతాలను పరిశీలించాలన్న ఉద్దేశంతోనే సైకిల్ యాత్ర ప్రారం భించినట్లు చెప్పారు. ఇందుకు రెండున్నరేళ్లు కేటా యించానన్నారు. అన్ని రాష్ట్రాలకంటే ఏపీలో ప్రజలు ఆప్యాయంగా పలకరించి, భోజన వసత కల్పిస్తున్నారనీ, దారిలో చాలామంది యోగాక్షే మాలు అడుగుతున్నట్లు జాసన్ తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖలో ఇష్టారాజ్యం

కిందిస్థాయి సిబ్బందికి వేధింపులు
ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు


పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు మరింత ముందడుగు వేసి వారు చేయాల్సిన పనులు చేయకపోగా.. కింది స్థాయి సిబ్బందిని వేధిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్న తాధికారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత సిబ్బంది వాపోతున్నారు. దీంతో అలాంటి అధి కారులు ఆడింది ఆట పాడింది పాటగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారుల తీరుతో సిబ్బంది మానసికంగా నలిగిపోతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఒక మండలంలో పనిచే స్తున్న జేఈ ఎవరి మాటా లెక్కచేయడనే విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు ఆ జేఈతో ఏ పని చేయించుకోలేక సతమతమవుతున్నారు. 'నా మండలంలో జోక్యం చేసుకోవడానికి మీరెవరు' అంటూ ఆయన ఉన్నతాధికారులపైనే తిరుగుబాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కింద స్థాయి సిబ్బంది పరిస్థితి అటు నుయ్యి.. ఇటు గొయ్యి అన్న చందంగా తయారయింది. పనిచేస్తే తన అనుమతి లేకుండా ఎలా చేస్తారని చివాట్లు పెడతాడు. చేయక పోతే ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో ఒత్తిళ్లతో నలిగి పోతున్నారు. దీంతో ఆ మండలం (మిగతా 7లో..)

దూసుకొచ్చిన

మృత్యువు

ఆపివున్న ఆటోను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... ఇద్దరికి గాయాలు..

7

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యా దుల పరిష్కార వేదిక నిర్వహించను న్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలు స్వీకరి స్తారన్నారు. జిల్లా ప్రజలు ఈ అ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళితులపై వైసీపీ దాష్టీకం

పీర్లపండుగలో తప్పెట కొట్టేందుకు రాలేదని ఆగ్రహం

దళితవాడ వద్ద ముళ్లకంపలు వేసిన వైసీపీ వర్గీయులు

ధర్మవరంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బ రావుపేట గ్రామంలో పీర్లపండుగలోకి దళితులు రాకూడదని వైసీపీ వర్గీయులు రెచ్చిపోయారు. ఏకంగా ఆ కాలనీకి వెళ్లే రహ దారికి అడ్డంగా ముళ్లకంపలు వేశారు. దీంతో ఆ గ్రామ దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన దళితులు పెద్దిరాజు లుతో పాటు మరికొందరు మీడియాతో మాట్లాడారు. గ్రామంలో శనివారం రాత్రి పీర్లపండుగలో భాగంగా పెద్దసరిగెత్తు జరిగింది. అక్కడికి కాలనీ నుంచి తప్పెట్లు కొట్టేందుకు పెద్దగంగప్ప, చిన్న గంగప్ప, వెంకటేష్, నారాయణస్వామి వెళ్లారు. వైసీపీ వర్గీయులు బాలు, కోన ఆటోకు వెనుక భాగాన చెట్టును కట్టుకుని వేగంగా వస్తున్నారు. ఆ వేగానికి చెటు తప్పెట కొడుతున్న చిన్నగంగప్పకు తగలడంతో కిందపడిపోయాడు. చిన్నగా రండి అంటూ చిన్నగంగ ప్పతో పాటు అక్కడున్న వారు యువకుల్ని వారించారు. దీంతో వైసీపీ వర్గీయులు బాలు, కోనతో పాటు నంద, విజయ్, శశికు మార్ మద్యం మత్తులో తప్పెట్లు కొడుతున్న వారిపై బూతులతో రెచ్చిపోయారన్నారు. దీంతో వెంటనే అక్కడున్న ఎస్సీలంతా ఏకమై పీర్ల మకాన్ వద్ద నుంచి వెనుతిరిగి వచ్చారు. తప్పెట్లు కొట్టేం దుకు రాలేదని ఆదివారం ఉదయం వైసీపీ వర్గీయులు.. పీర్లపండ గలోకి దళితులు రాకూడదని దళిత వాడ రహదారి వద్ద ముళ్ల కంపలు అడ్డువేశారు. ఇదంతా ఆ గ్రామ వైసీపీ నాయకుల కనుస న్నల్లోనే జరిగిందని దళితులు ఆరోపించారు. ఈ విషయంపై రూరల్ సీఐ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. ఎస్సీకాలనీకి వెళ్లే రహ దారికి ముళ్లకంపలు అడ్డువేశారని తన దృష్టికి వచ్చిందని, వెంటనే సిబ్బందిని గ్రామానికి పంపి విచారణ చేస్తున్నామని అన్నారు. విచారణచేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.


ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ముళ్లకంపలు వేసిన వైసీపీ వర్గీయులు




అలరించిన ఐయాం సాయిబాబా

పుట్టపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు చేపట్టిన 'ఐయాం సాయిబాబా' సంగీత నృత్యనాటిక భక్తులను అలరింపచేసింది. మూడవరోజు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో అమెరికా భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిం చారు. బాలవికాస్ చిన్నారుల నృత్యం.. భక్తులను మైమరపింపజేసింది. సత్యసాయి చూపిన ప్రేమతత్వం, సేవలను తెలియజేస్తూ నాటికను ప్రదర్శించారు. అనంతరం సత్య సాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రైతుల సహనానికి పరీక్ష...!

(5వ పేజీ తరువాయి)

కూడా నిర్వహించింది. ఏ ఒక్క రోజు కూడా నీటి, మట్టి పరీక్షలు చేసిన పాపాన పోలేదని రైతులు మండిపడుతున్నారు. వైసీపీ హయాంలో భూసార పరీక్షా కేంద్రాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో అవి మూతపడ్డాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. రైతులు తమ పొలాల్లోని మట్టి, నీటిని పరీక్షల కోసం అనంతపురంలోని భూసార నీటి పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూమిలో స్థూలపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, ఐరన్ ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలియక అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతుండటంతో సాగు చేసిన పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా భూసార పరీక్షా కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లయినా పనిచేయని ల్యాబ్



వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ ద్వారా భూసార, నీటి పరీక్షలు చేస్తామని అధికారులు తెలిపారు. ఐదేళ్లవుతున్నా కొత్తచెరువువ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఉన్న వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ పరీక్షలకు నోచుకోలేదు. దీంతో మట్టి, నీటి పరీక్షల కోసం ఇబ్బంది పడుతున్నాం.

- కొనప్ప, రైతు, కొత్తచెరువు

అనంతపురం వెళ్లాల్సిందే



మా పొలాల్లో మట్టి, నీటి పరీక్షల కోసం అనంతపురం వెళ్లాల్సిందే. గతంలో ధర్మవరం వెళ్లేవాళ్లం. అక్కడ భూసార పరీక్షా కేంద్రం మూతపడటంతో వ్యయప్రయాసలకోర్చి అనంతపురం వెళ్లాల్సి వస్తోంది.

- జయచంద్ర, రైతు, ముదిగుబ్బ

పంచాయతీరాజ్ శాఖలో ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

అంటేనే పంచాయతీరాజ్ శాఖలో సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన అధికారులకు సహాయ నిరాకరణ చేస్తూ మొండికేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వారికి తగిన ప్లేస్ రాకపోవడంతో ఇక్కడికి వచ్చిన వారికి చుక్కలు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఉన్నతాధికారుల ముందే జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో బాధిత సిబ్బంది తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి వీటిపై దృష్టి సారించాలని సిబ్బంది కోరుతున్నారు.

పనులు లేని పీఏలు

ఉన్నతాధికారులకు సహాయకులుగా ఉండేందుకు నియమించిన పీఏలకు పనిలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు వచ్చే ఫైల్స్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి ఆ విభాగ అధిపతికి పంపేందుకు డీఈ స్థాయి అధికారులను పీఏలుగా నియమించుకున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో ఏకంగా ముగ్గురు పీఏలుగా ఉన్నారు. పనులే లేనప్పుడు ముగ్గురు పీఏలు ఎందుకనే ఆ వర్గాల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న ఎస్ఈ జహీర్ అస్లాం వీరిపై ఎన్నడూ ఆలోచించలేదు. ఈఈగా ఉన్నప్పుడు ప్రభాకర్‌రెడ్డి పలు సందర్భాల్లో ముగ్గురు పీఏలు ఇక్కడ అవసరమా? అన్న అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయనే ఇన్‌చార్జ్ ఎస్ఈగా కూడా ఉన్నారు. పీఏల పనితీరుపై నిఘా పెడతారన్న చర్చ జరిగింది. ప్రస్తుతం ఆయన కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలుచోట్ల ఇన్‌చార్జ్ డీఈలను నియమించారు. ఇలాంటి నేపథ్యంలో ముగ్గురు సీనియర్ డీఈలను ఎలాంటి పని లేని చోట నియమించడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది.

యువకుడిని కాపాడిన పోలీసులు

రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం

ఫోన్‌కాల్‌తో పోలీసులు అప్రమత్తం.. బంధువులకు అప్పగింత



ట్రాక్‌పై మహేష్

రొద్దం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహేష్ అనే యువకుడు రైల్వే పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. స్థానిక పోలీసులు ప్రాణాపాయం నుంచి కాపాడారు. రొద్దం ఎస్ఐ నరేంద్ర అందించిన సమాచారం మేరకు.. రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మహేష్ దొడ్డబళ్లాపురంలో పనిచేస్తూ కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. లోచర్ల గ్రామానికి చెందిన సచివాలయ మహిళా సంరక్షణ అధికారి కల్పనకు యువకుడు ఫోన్‌చేసి రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వెంటనే ఆమె ఎస్ఐకు సమాచారం అందించారు. ఆయన పెనుకొండ డీఎస్పీ నరసింగప్పకు సమస్యను వివరించారు. అప్రమత్తమైన డీఎస్పీ దొడ్డబళ్లాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా దొడ్డబళ్లాపురం పోలీసులు గ్రామ సమీపంలోని ట్రాక్‌పై పడుకుని ఉన్న యువకుడిని ప్రాణాపాయం నుంచి రక్షించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి బంధువులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పజెప్పారు.

కొత్త కోర్సులకు అనుమతి

అనంతపురంరూరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త కోర్సులకు అనుమతి లభించింది. కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్‌కు రెండు కొత్త కోర్సులకు తాజాగా అనుమతులు వచ్చాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్- డేటా సైన్స్(సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫీయల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎం) కోర్సులకు అనుమతులు వచ్చాయి. ప్రతి కోర్సుకు 60 సీట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) కోర్సులకు 60సీట్లు చొప్పున ఉన్నాయి. వీటిని 120 సీట్లకు పెంచారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి

అనంతపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి ఉప్పరపాటి వెంకటేశులు, ఎద్దులపల్లి కుమార్, వాణిరాయుడు సంయుక్త అధ్యక్షతన 'ఆర్డీటి సేవలు - సామాజిక ఆవశ్యకత' అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు డాక్టర్ శాంతినారాయణ, వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, వాహెబ్‌ఖాన్ ప్రధానవక్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్డీటి అనేక దశాబ్దాలుగా జిల్లాలో పేదల అభ్యున్నతికోసం కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వేలాది గ్రామాల్లో విద్య, ఆరోగ్య సేవలు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఇలాంటి మహాసంస్థ సేవలను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని, ఆ మేరకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, హనుమంతరాయుడు, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆపివున్న ఆటోను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... ఇద్దరికి గాయాలు..



ప్రమాదానికి కారణమైన బస్సు, దెబ్బతిన్న ఆటో



ఆటోడ్రైవర్ మహమ్మద్ హుస్సేన్(ఫైల్)

గార్లదిన్నె, జూలై 13(ఆంధ్రజ్యోతి): బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మండలంలోని కల్లూరు సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) దుర్మరణం చెందగా.. ఇద్దరు చిరు వ్యాపారులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదోనికే చెందిన ఉమాదేవి, మరియమ్మ తోపుడుబండ్లపై మొక్కజొన్న కంకులు అమ్ముకునేవారు. మొక్కజొన్న కంకులు తీసుకెళ్లేందుకు మరియమ్మ, ఉమాదేవి, ఖాజామొహిద్దీన్.. మహమ్మద్ హుస్సేన్ ఆటోను బాడుగకు తీసుకుని, శనివారం రాత్రి అనంతపురం వచ్చారు. మార్కెట్‌లో మొక్కజొన్న కంకులు కొనుగోలు చేసి, ఆటోలో వేసుకుని ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు సమీపాన ఆటో టైరు పంక్చరైంది. మరియమ్మ, ఉమాదేవి ఆటోలోనే కూర్చోగా.. ఖాజా మొహిద్దీన్ రోడ్డు పక్కన లైట్ వేస్తుడంగా.. మహమ్మద్ హుస్సేన్ టైరు మార్చుతుండేవాడు. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు అతివేగంతో రావడంతో లైట్ వేస్తున్న ఖాజామొహిద్దీన్ పక్కకు పరుగెత్తాడు. ఆటోను బస్సు వేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో పల్టీలు కొట్టింది. అందులో కూర్చున్న మరియమ్మ, ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరియమ్మ, ఉమాదేవిని 108 వాహనంలో అనంతపురం తరలించారు. మహమ్మద్ హుస్సేన్‌కు భార్య యాస్మీన్, నలుగురు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగాధర్ పరారయ్యాడు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

క్రికెట్ అభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో పాల్గొన్న సీనియర్ క్రికెటర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో జిల్లా క్రికెట్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహకంపై చర్చించారు. ప్రతిభ గల క్రీడాకారులకు ఎంపికలో పారదర్శకత పాటించాలని నిర్ణయించారు. క్రికెట్‌కు, క్రీడాకారులకు ఆర్డీటీ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకానికి అభినందిస్తూ తీర్మానించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, క్రీడాకారులు పగడాల మల్లికార్జున, షాబుద్దీన్, సురేష్, శ్రీనాథ్, మోహన్, చంద్ర, మచ్చా రామలింగారెడ్డి, శ్రీవాసు, ప్రసన్న, కమలాకర్ నాయుడు, వెంకటేష్, గులాం పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-19 ప్రాబబుల్స్‌లో

ఐదుగురికి చోటు



వీరారెడ్డి | జయంత్‌కృష్ణ | భువనేశ్వర్



రిహాన్



సాయిప్రతాప్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన ఐదుగురికి చోటు దక్కింది. వీరారెడ్డి, జయంత్‌కృష్ణ, భువనేశ్వర్, రిహాన్, సాయి ప్రతాప్‌రెడ్డి ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన వివిధ క్రికెట్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచడంతో వీరికి అవకాశం దక్కిందన్నారు.

రేషన్ బియ్యం దందా..!

(5వ పేజీ తరువాయి)

నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వాటిని ఒక చోట డంప్ చేసి... అక్రమంగా రవాణా చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దు దాటించి కర్ణాటక ఇతర రాష్ట్రాలకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. డీ హీరేహాల్, రాయదుర్గం, చిలమత్తూరు, హిందూపురం ఇతర సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లా దాటిస్తున్నారు. ఇక్కడ కిలో సుమారు రూ.15లకు కొని, పక్క రాష్ట్రాల్లో రూ.22 నుంచి రూ.25 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. జిల్లా నుంచి ఏటా 3 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల వరకూ అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్వింటాళ్ల కొద్దీ బియ్యం స్వాధీనం...

విజిలెన్స్ దాడుల్లో భారీగానే అక్రమ రవాణాదారులు పట్టుబడుతున్నారు. ఈనెల 3న డి హిరేహాళ్ మండలం లింగమనహళ్లి గేటు సమీపంలో కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనంలో 43.60 క్వింటాళ్లు అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి, పట్టుకున్నారు. ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న డ్రైవర్లు, బియ్యం ఓనర్ ఇద్దరూ కర్నాటకకు చెందిన వారే కావడం గమనార్హం. గతనెల 30వ తేదీ కూడా విజిలెన్స్ అధికారుల దాడుల్లో భారీగానే పట్టుబడ్డాయి. సుమారు 99 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాను అధికారులు పట్టేశారు. వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యాన్ని అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారిపై అధికారులు పట్టుకుని, సీజ్ చేశారు. 2024-25 ఏడాదిలో ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 25వతేదీ వరకూ ఏకంగా 121 కేసులు నమోదు చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్న 2,745 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే 39 కేసులు నమోదుచేశారు. 1,298 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



రేషన్ బియ్యాన్ని విక్రయించినా, అక్రమంగా తరలించినా నేరం. అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సబ్సిడీ బియ్యాన్ని తరలిస్తే... కఠిన చర్యలు తీసుకుంటాం.

-వైబీపీటీఏ ప్రసాద్, ఏఎస్పీ, విజిలెన్స్

గేటుకు తాళం వేసి రీకౌన్సెలింగ్

పలువురు ఏఎన్ఎంల నిరసన

పర్యవేక్షించిన డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ, పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్

అనంతపురం వైద్యం, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి తాళాలు వేసి.. ఆదివారం ఏఎన్ఎంలకు రీకౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు ఒకేస్థానంలో విధులు నిర్వహించిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఏఎన్ఎంలకు గత నెల 30న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి కౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు ఈ కౌన్సెలింగ్‌ను రద్దుచేసి రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఎంహెచ్ఓకు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. ఆర్డర్లు ఇచ్చే సమయంలో ఇలా చేయడం ఏమిటని డీఎంహెచ్ఓ, కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనగళం విప్పారు. కోరుకున్న స్థానాలు దక్కనివారితో డీఎంహెచ్ఓ సిబ్బంది ముడుపులు తీసుకుని రీకౌన్సెలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఏఎన్ఎంల బదిలీల ఫైల్‌ను తెప్పించుకుని డీఎంహెచ్ఓ, ఏఓ, సిబ్బందిని తనవద్ద కూర్చుబెట్టుకుని కసరత్తు చేశారు. తమకు అన్యాయం జరుగుతోందని కొందరు ఏఎన్ఎంలు ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన రీకౌన్సిలింగ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో కార్యాలయ ప్రధాన గేట్‌కు తాళంవేసి డీఎంహెచ్ఓ చాంబర్‌లో బదిలీల ప్రక్రియ నిర్వహించారు.

తాళంవేసి..

వైద్య, ఆరోగ్య శాఖలో కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన బదిలీల ప్రక్రియ సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయానికి తాళంవేశారు. అధికారులు, సిబ్బంది ఫోన్‌లను స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆన్‌లైన్‌ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించగా డిప్యూటీ కలెక్టర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు. 792 మంది ఏఎన్ఎంలకు అర్ధరాత్రివరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ సోమవారం వస్తాయా? ఇంకా ఆలస్యం అవుతుందా? మళ్లీ ఏమైనా జరుగుతుందా? అని కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఏఎన్ఎంలు సందేహాలను వ్యక్తం చేశారు. ఏఓ గిరిజా మనోహర్ రావు, సిబ్బంది కమలాకర్‌రాజు, అశోక్, రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

తుది దశకు మరమ్మతులు



లైనింగ్‌కు క్యూరింగ్

(5వ పేజీ తరువాయి)

సింగిల్ ఇండెంట్‌గా తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారుల ద్వారా తెలుస్తోంది. 500 క్యూసెక్కులలోపే తన వాటా నీటిని తీసుకుంటోంది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి రెండు వాటాల నీరు ఒకేసారి తీసుకుంటే నీటి ప్రవాహం నష్టాలు ఇరు రాష్ట్రాల ఖాతాల్లో ఉంటాయి. ప్రస్తుతం కర్ణాటక సింగిల్ ఇండెంట్ కారణంగా ప్రవాహ నష్టాన్ని ఒంటరిగా భరించే పరిస్థితి నెలకొంది. దీంతో ఆంధ్ర వాటా జలాలు విడుదలయ్యే వరకు పరిపూర్ణంగా కర్ణాటక తన వాటాను తీసుకునే పరిస్థితిలో లేదు. అదే విధంగా జిల్లాకు తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల మేరకు కేటాయించుకోవాల్సి ఉండడంతో తొలి ప్రాధాన్యంగా తాగునీటి కోసం పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు మళ్లించి సాగుకు కేటాయించిన 8.36 టీఎంసీల నీటిని నిదానంగా విడుదల చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడాది 18.36 టీఎంసీల మేరకు హెచ్చెల్సీ వాటా నిర్ణయించడంతో ఆ మేరకు అధికారులు నీటి వినియోగాన్ని నిర్ణయించుకున్నారు. అధికారులు కాంట్రాక్టర్లపై నెలరోజుల నుంచి తీవ్ర ఒత్తిడి తెచ్చి అనుకున్న సమయానికి పనులను ముగించే పరిస్థితికి తీసుకొచ్చారు.

ఇంటి దొంగలు..!

(5వ పేజీ తరువాయి)

మంజూరయ్యే అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా 3,650 మంది పక్కాగృహాల కోసం అధికారులకు వినతులు అందించారు. వీటిని పరిశీలిస్తే వీటిలో మరింతమంది పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించే అవకాశాలున్నాయని ఆ శాఖాధికారులు అంటున్నారు. పక్కాగృహం గత ప్రభుత్వంలో తీసుకున్నావని చెప్పగానే (వారికి తెలియకుండా) బిల్లులు మంజూరు కావడంతో వారు పెడుతున్న శాపనార్థాలు అన్నీఇన్నీకావు. ఎంతోమంది లబ్ధిదారులు తమకు తెలియకుండానే తమ బిల్లులు కాజేశారనీ, అప్పట్లో మహిళాసంఘాల మీద పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేశారు. గతంలో అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు.. పోలీసు స్టేషన్‌లో దుప్పటి పంచాయితీలు చేసి, రాజీ కుదిర్చారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆ నిరుపేదలు నేడు పక్కాగృహాలకు నోచుకోలేక పడుతున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నా పేరుతో పక్కాగృహం మంజూరైందంట



మేం పెద్దలు కట్టించిన పాత ఇంట్లో నివాసం ఉంటున్నాం. పక్కాగృహం కోసం దరఖాస్తు చేస్తే, గతంలోనే మంజూరై, బిల్లులు కూడా తీసుకున్నారని అధికారులు అంటున్నారు. మేం ఇల్లు కట్టుకోలేదు, బిల్లులూ తీసుకోలేదు. నా పేరుమీద ఎవరు బిల్లులు తీసుకున్నారో తెలియదు. ఆన్‌లైన్‌లో పేరు ఉండడంతో పక్కాగృహాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించి, నిరుపేదలైన మాకు పక్కాగృహాలు మంజూరు చేయాలి.

-శ్యామలమ్మ, వడ్డిపల్లి, తనకల్లు మండలం

ఆన్‌లైన్‌లో పేరుంటే ఏమీ చేయలేం

ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద 1, 2, 3 దశల్లో పక్కాగృహాలు మంజూరైనా బిల్లులు పొందిన అందరూ ఆన్‌లైన్ ఉన్నారు. ఆన్‌లైన్‌లో పేరుంటే వారికి పక్కాగృహాల కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేయలేం. మండలవ్యాప్తంగా 3,600 దరఖాస్తులు అందాయి. వీటిపై విచారిస్తాం.

-విజయభాస్కర్, గృహనిర్మాణ శాఖ ఏఈ, తనకల్లు

కొలిక్కివచ్చిన టీచర్ల క్యాడర్ సమస్య

అనంతపురం విద్య, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీచర్ల జిల్లా క్యాడర్ స్ట్రెంత్ సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. గతనెలలో ప్రభుత్వం టీచర్ల బదిలీలు చేపట్టింది ఆ సమయంలో రేషనలైజేషన్‌లో అనేక పోస్టులు పోయాయి. కొత్త పోస్టులు ఇవ్వడంతో అనేకమంది స్కూల్ అసిస్టెంట్లు మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా వెళ్లారు. మరికొన్ని స్కూళ్లను గ్రేడ్‌లు మార్చారు. కొందరు టీచర్లకు పదోన్నతులు కల్పించారు. జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం అన్ని క్యాడర్లు కలిపి 7,152 మంది టీచర్లు బదిలీ అయ్యారు. అన్ని క్యాడర్లు కలిపి 584 మందికి పదోన్నతులు కల్పించారు. కొత్త పోస్టులకు క్యాడర్‌స్ట్రెంత్‌కు ఖచ్చితంగా లెక్కలు చూపిస్తేనే ఆర్థికశాఖ నుంచి ఆమోదం పొంది వేతనాలు విడుదలవుతాయి. ఈ లెక్కలు చూపించడంలో ఆలస్యమవుతుండడంతో ఈనెల వేతనాలు చాలామంది టీచర్లు అందుకోలేకపోయారు. దీనిపై విద్యాశాఖ కమిషనర్ సీరియస్ కావడంతో జిల్లా ఐటీసెల్‌కు చెందిన ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, మాజీ ఏఎస్ఓ, ఎంఈఓ జయచంద్రనాయుడు, మారుతీ మంగళగిరిలోని విద్యాశాఖ కమిషనరేట్‌కు వెళ్లారు. రెండురోజులుగా అక్కడే ఉంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్యాడర్ స్ట్రెంత్‌ను పరిగణలోకి తీసుకొని ఇటీవల జరిగిన బదిలీలకు అనుగుణంగా లెక్కలు తేల్చి కొలిక్కి తెచ్చారు. సోమవారం కమిషనర్‌కు అప్పగిస్తామని ఏఎస్ఓ తెలిపారు. ఈనెల 20వతేదీలోగా వేతనాలు అందని టీచర్లకు మంజూరు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దీంతో ఇటు విద్యాశాఖ అధికారులు, అటు టీచర్లు ఊపిరిపీల్చుకుంటున్నారు.

గుత్తిలో రెండు చోట్ల చోరీ

గుత్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు చోట్ల శనివారం రాత్రి చోరీ జరిగింది. వ్యవసాయ పొలంలో మోటర్, ఎలక్ట్రికల్ సామాగ్రి చోరీ చేశారు. అదే విధంగా ఓ మెకానిక్ షాపులో రూ.25వేలు విలువ చేసే సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రోడ్డులో ఓ వ్యవసాయ పొలంలో బోరులోని మోటరు, పైపులు, వైర్లను, కంటైనర్లకు ఉన్న తాళాలను పగలగొట్టి అందులో ఎలక్ట్రికల్ సామాగ్రిని చోరీ చేసినట్లు బాధితుడు మాకం రంగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ. 90వేలు విలువ చేసే సామగ్రి చోరీ అయ్యిందని బాధితుడు వాపోయాడు. అదే విధంగా ఆటో మెకానిక్ షాపులో షాపు తాళాలను పగలగొట్టి అందులో ఉన్న రూ.25వేల విలువ చేసే సామగ్రిని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాసనం గుర్తింపు



అచ్యుతరాయల శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

పెనుకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసవన్నబావి వద్ద 1532 నాటి అచ్యుతరాయల శాసనాన్ని గుర్తించినట్లు ప్రముఖ చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. ఆదివారం బుక్కపట్నానికి చెందిన పరిశోధకుడు గోపి, శ్రీధర్‌స్వామితో కలిసి పట్టణంలోని విజయనగర సామ్రాజ్యంనాటి కట్టడాలు, శిల్పసంపదపై పరిశోధనలో భాగంగా శివాలయం వద్ద ఉన్న ఉత్సవ మండపాన్ని, బసవన్న బావిని ఆయన పరిశీలించారు. బసవన్న బావి ముందు కనిపించిన ఓ శాసనాన్ని పరిశీలించారు. కన్నడంలో రాసిన ఆ శాసనంలో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతరాయలు పరిపాలిస్తున్న కాలంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఒక మెట్లబావిని, ఉత్సవ మండపాన్ని నిర్మించారు. బావి ముందున్న ఓ రాతిపలకపై గల శాసనంపై 'నమస్తుంగ శిరస్సుంబి శిరుస్సుంబి చంద్రచామర చారవే త్రైలోక్య నగరాంభ మూలస్తంభాయ శంభవే' అని శివస్తుతితో మొదలవుతుంది. శాలివాహన శకవర్షం 1454 వైశాఖ శుద్ధ 15నాడు అనగా సామాన్యశకం 1532 ఏప్రిల్‌లో శివాలయం కోసం ఒక మెట్లబావిని తవ్వించినట్లు శాసనం వివరిస్తుందని మైనాస్వామి పేర్కొన్నారు. ఒకప్పుడు ఎంతో సుందరంగా ఉన్న మెట్లబావి ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. బావిలో ఎడమవైపు 'శ్రీ త్రయంబక శరణో' అనే ఏకవాక్య కన్నడశాసనాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆ శాసనం వద్ద విజయనగర సామ్రాజ్య చిహ్నాలైన సూర్యచంద్రులు, కత్తి, శివలింగం చెక్కబడి ఉన్నాయన్నారు. భారత పురావస్తుశాఖ అధికారులు చొరవ తీసుకుని బావి మరమ్మతులు, శాసనం రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సల్లాపురమ్మ ఊరేగింపు


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లిలో గ్రామదేవత సల్లాపురమ్మను ఆదివారం ఘనంగా ఊరేగించారు. వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రతియేటా సల్లాపురమ్మను ఊరేగిస్తారు. మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నాయకులు జెరిపిటి ఆంజనప్ప, సొసైటీ అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి, మహబూబ్ బాషా, రాజారెడ్డి, జెరిపిటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్కదేవతలకు మాజీమంత్రి పూజలు

● పుట్టపర్తిరూరల్: మండలపరిధిలోని సుబ్బరాయినిపల్లి సమీప అటవీప్రాంతంలో వెలిసిన అక్కదేవ తల జాతరకు మాజీ మంత్రి పల్లె హాజరై, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎండ్లబండిలో ఊరేగితూ సందడి చేశారు. టీడీపీ నాయకులు శ్రీరాంనాయక్, బొమ్మయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కోట శ్రీనివాసరావుకు నివాళి


కోట శ్రీనివాసరావుతో బాబా (ఫైల్)

నంబులపూలకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో 700కుగాపై సినిమాల్లో నటించిన కోట శ్రీనివాసరావుకు మండలంకేంద్రానికి కల్లూరి బాబా ఆదివారం నివాళులు అర్పించారు. తాను బతుకు దెరువు కోసం హైదబారాద్ లో పనిచేస్తుండగా, ఆసుపత్రిలో ఆయన పలకరింపు నేటికీ గుర్తుందన్నారు. తనకు ఓ సినిమాలో ఓ క్యారెక్టర్ అవకాశం ఇచ్చినట్లు గుర్తు చేశారు. రాధ సినిమాలో న్యాయమూర్తిగా కోట శ్రీనివాసరావు, సాక్షిగా తాను నటించినట్లు ఆయన తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

ధర్మవరం, జూలై13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా, ప్రజలకు ఇబ్బందులు కల్గించేలా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రెడ్డప్ప రౌడీషీటర్లను హెచ్చరిం చారు. సీఐ ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏఎస్ఐ జోజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు

పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 11 మందిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుంటే ఫోన్ నెం. 6305800429కు పోన్ చేయాలని సూచించారు. పట్టణంలోని శాంతినగన్ ట్యాంకు కింద పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు చేసి వారి నుంచి రూ.3550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హత్యాప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ

కదిరి అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవాండ్లపల్లిలో ఈనెల 11న నవీన్ అనే యువకుడు హత్యకు గురైన స్థలాన్ని డీఎస్పీ శివనారాయణస్వామి ఆదివారం పరిశీలించారు. గ్రామస్థులతో హత్య విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

ఆవుల అపహరణపై ఫిర్యాదు

కొత్తచెరువు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ పొలం వద్ద షెడ్‌లో కట్టేసిన రెండు పాడి ఆవులను శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారని మండల కేంద్రానికి చెందిన పాడిరైతు పల్లి కిష్టప్ప స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. రోజు మాదిరిగానే వ్యవసాయ షెడ్ వద్ద పాలు పిండి ఆవులను షెడ్‌లో కట్టివేసి ఇంటికి వచ్చానన్నారు. శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఆవులను అపహరించా దీంతో రూ. 2లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

బొలెరో వాహనం బోల్తా

అమడగూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులవారిపల్లి సమీపంలో మహమ్మదాబాద్-అమడగూరు రహదారిలో శనివారం రాత్రి బొలేరో వాహనం బోల్తాపడింది. కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి చెందిన వాహనం ఓడీసీ మండలంలోని కోటాల గ్రామం నుంచి చింతామణికి టమోటా లోడుతో వెళ్తోంది. గాజులవారిపల్లి సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడినట్లు డ్రైవర్ రాజేష్ తెలిపారు. డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

నలుగురిపై దాడి కేసు

బుక్కపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరామపురం గ్రామంలో శనివారం రాత్రి మొహర్రం సందర్భంగా అల్లావు తొక్కుతుండగా స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన చందు, నాగలక్ష్మి, రఘు, ఆంజనేయులు, చెన్నకేశవులు, పవన్‌కు మార్ కలిసి గ్రామ సమీపంలోని కసబతండాలో నివసిస్తున్న తరుణ్‌నాయక్, వెంకటనారాయణనాయక్, సాలీబాయి, శిరీషా బాయిపై దాడిచేశారు. తరుణ్‌నాయక్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ... వ్యక్తి మృతి


శ్రీనివాసులు నాయక్(ఫైల్)

ముదిగుబ్బ, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొడరాళ్ళపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ముదిగుబ్బ మండలం రామస్వామి తండాకు చెందిన శ్రీనివాసులు నాయక్ (62) స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు వెళుతున్నాడు. ముదిగుబ్బ వైపు నుంచి బుక్కపట్నం వైపు వెళుతున్న లారీ పొడరాళ్ళపల్లి బస్టాప్ సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. శ్రీనివాసులు నాయక్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవాడు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్సై రాజశేఖర్‌తెలిపారు.

అంగన్‌వాడీ నేత మృతి

బత్తలపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల యూనియన్ స్థానిక ప్రాజెక్ట్ నాయకురాలు వాసంతి బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆదివారం మృతి చెందారు. మండలంలోని యర్రాయపల్లికి చెందిన వాసంతి 20 సంవత్సరాలకు పైగా అంగన్‌వాడీ కార్యకర్తగా, యూనియన్ లీడర్‌గా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఇంట్లో కళ్లు తిరిగి పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా వాసంతి కళ్లను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు.


ధర్మవరంలో దుర్గమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


చౌటకుంటపల్లిలో ఏటి గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

అమ్మవార్లకు బోనాలు

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసేపేటలో ఉన్న శాంతకళా చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దుర్గమ్మకు ఆదివారం బోనాలను సమర్పించారు. వంద మంది మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా దుర్గమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఆషాఢ మాసంలో దుర్గమ్మకు బోనాలను సమర్పించామని వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని చౌటకుంటపల్లిలో ఏటి గంగమ్మ దేవతకు ఆదివారం బోనాలు సమర్పించారు. గతంలో పలుమార్లు ఏటి గంగమ్మకు బోనాలు సమర్పిం చిన తరువాల తరువాత వర్షం కురిసిందని గ్రామ పెద్దలు తెలిపారు. ఆ ఆనవాయితీ ప్రకారం ప్రతి ఇంటినుంచి అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు అధిసంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో తనకల్లు గ్రంథాలయం

● వర్షం వస్తే తడుస్తున్న వైనం
● చెదలు పడుతున్న పుస్తకాలు
● పట్టించుకోని ఉన్నతాధికారులు


తనకల్లు శాఖ గ్రంథాలయం


పుస్తకాలు తడవకుండా పట్ట కప్పిన దృశ్యం

తనకల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయం పూర్తి శిథిలావస్థకు చేరింది. కనీస వసతులు కరువయ్యాయి. వర్షం వస్తే తడిసిపోతోంది. ఈ గ్రం థాలయాన్ని పంచాయతీ కార్యాలయంలోని చిల్డ్రెన్ పార్కు స్థలంలో 1965లో ఏర్పాటుచేశారు. 1992వరకు అక్కడే కొనసాగింది. 1992లో ఇందిరాగనర్‌లోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లోకి మార్చారు. నాటి నుంచి అక్కడే కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం గోడౌన్‌కు పైభాగాన ఏర్పాటు చేసిన కిటికీలు తుప్పుపట్టాయి. తలుపులు విరిగిపోయి, పడడంలేదు. దీతో గ్రంథాలయంలోని పుస్తకాల న్నీ వర్షానికి తడిసి చదలు పట్టిపోతున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న గ్రంథాలయాధికారి పుస్తకాలను మూటలు కట్టి, తడిసేందుకు అవకాశం లేని ఓ చిన్న గదిలో ఉంచారు. గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత, ఇతర పాఠకులు ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు ఈ గ్రంథాలయం ఎంతో పేరుగాం చింది. ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేందుకు తోడ్పాటు అందించింది. అలాంటి విజ్ఞాన భాండాగారానికి వచ్చే పాఠకుల సంఖ్య క్రమేణ తగ్గిపోతోంది. ప్రభుత్వాలు గ్రంథాలయాలను ఓ వైపు డిజిటైలేషన్ చేస్తున్నా, తనకల్లు గ్రంథాలయాన్ని పర్యవేక్షించి, సౌకర్యాలు కల్పించాల్సిన ఉన్నతాధికారులు ఆ వైపుగా ప్రయత్నించిన దాఖలాలు లేవు. మండల స్థాయి అధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడడంలేదు. గ్రంథాలయం రోజురోజుకు దెబ్బతింటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయంలో సమస్యలను పరిష్కరించి... పాఠశాల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 2019లో అప్పటి జాయింట్ కలెక్టర్ సుబ్బరాజు గ్రంథాల యానికి 15 సెంట్లు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించలేదు. గ్రంథాలయాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయానికి మార్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు జరుపుతున్నారు.

-మస్తాన్‌వలి, గ్రంథాలయ అధికారి, తనకల్లు

సేవకుడిగా ఇంటికొచ్చా

● మంత్రి సత్యకుమార్
● పట్టణంలో మూడో రోజు పాదయాత్ర


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఒక నాయకుడిలా కాకుండా, సేవకుడిగా మీ ఇంటి వద్దకు వచ్చానని మంత్రి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలతో అన్నారు. ఆయన మూడో రోజు ఆదివారం పట్టణంలోని 21,22 వార్డులలో పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడు చాలా మంది ఇంటిపట్టా ఇచ్చారు స్థలం ఎక్కడుందో తెలియదని చెబుతున్నారని తెలిపారు. స్థలాలను గుర్తించి స్పష్టంగా రికార్డు చేయమని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే అమృత్ పథకంలో గతంలో మంజూరైన ట్యాంకుల నిర్మాణాలు పూర్తి కాలేదని విన్నవించగా, త్వరలో పూర్తవుతాయని తెలిపారు. అదేవిధంగా చేనేతల మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు కేంద్రం ఇన్ ప్రిన్సిపల్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్రం నుంచి రూ.30 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.10 కోట్లు కలిపి మొత్తం రూ.40కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. ఇందుకు మార్కెట్‌యార్డ్‌లో స్థలాన్ని కేటాయించామని మంత్రి తెలిపారు. అలాగే పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులకు అప్పగించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొ రే షన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు సంధా రాఘవ, ఫణికుమార్, నాగూర్ హుస్సేన్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, బొట్టు కిష్ట, జింకలరాజన్న, కేశగాళ్ల శీన, అడ్రా మహేశ్, బీజేపీ నాయకులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, సాకేఓబుళేశు, జనసేన పార్టీ నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాల్లో విలన్‌లా వైసీపీ నాయకుల మాటలు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


ప్రజలకు కరపత్రాలు ఇచ్చి పథకాలను వివరిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ సినిమాల్లో విలన్ తరహాలో వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పట్టణంలోని సాయినగర్‌లో ఆదివారం టీడీపీ స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొన్ని కారణాల వల్ల సంక్షేమపథకాలు రాలేదని కొందరు చెప్పగా వాటిని సంబంధిత అధికారుల దృష్టికీతీసుకెళ్లి పథకాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని కత్తేకొట్టాల గ్రామానికి చెందిన బన్నెల కళ్యాణ్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఏడాది పాలనపై ప్రజల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఎలా భయభ్రాంతులకు గురిచేశారో, ప్రతిపక్షాల వారిపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు ఎలా గురిచేశారో ఇప్పుడు కూడా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. తాజాగా పేర్నినాని వ్యాఖ్యలు తమతోపాటు వారి సొంత పార్టీ నేతలను కూడా రెచ్చగొట్టేలా చేశాయన్నారు. ఈ వ్యాఖ్యల వల్ల వైసీపీ కార్యకర్తలు గొడవలు పడితే ఆ తరువాత వచ్చే కేసులు ఎవరు భరిస్తారన్నారు. టీడీపీ శ్రేణులు ఇవన్నీ పట్టించుకోకుండా నాలుగేళ్ల పాటు ప్రజలకు మంచి చేయడంలోనే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు ఫణికుమార్, మద్దిలేటి, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, గవ్వల నారాయణస్వామి, బొట్టుకిష్ట, జింకల రాజన్న, చీమల రామాంజి, అడ్రా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల రిలేదీక్షలు

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం 17 రోజులుగా రిలేనిరాహార దీక్షలు చేస్తున్నామని, అయితే ప్రభుత్వానికి, అధికారులకు పట్టవా అని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు మండిపడ్డా రు. తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం రిలేనిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమస్యలపై దీక్షలు చేపడుతున్న తమపై కనీసం కనికరం కూడా చూపడం లేదన్నారు. జీతాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనే వివిధ సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఏబీసీ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పాదయాత్రలో భాగంగా మంత్రి యనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్‌ను సందర్శించారు. అక్కడి మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది, సెర్లిలైజేషన్ విధానాలపై సమీక్షించారు. జంతువుల సంక్షేమాన్ని విస్మరించకుండా, ప్రజల భద్రతకు ముప్పుగా మారే పరిస్థితులను నిర్మూలించేందుకు మున్సిపల్ అధికారులు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, డీఈ ప్రకాశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, బీజేపీ రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పోతుకుంట రాజు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని 2019లో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో నియమితులైన నూతన షిఫ్ట్ ఆపరేటర్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్‌యాదవ్‌కు ఆదివారం పాదయాత్రలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఏపీసీఎఎస్ జీఎం ఎస్ నెం. 151 వల్ల ప్రస్తుతం రూ.18,500 మాత్రమే వస్తోందన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఆర్డీటీ క్యాంపు-ఎ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఇందులో సాధిక్ 25, మహమ్మద్ 20, తరుణ్ 40 పరుగులతో రాణించారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన క్యాంపు - బి జట్టు 30వ ఓవర్ చివరి బంతికి విజయాన్ని అందుకున్నా రు. వీరిలో రాంప్రణయ్ అద్భుతంగా రాణించి 80పరుగులు చేయగా, నందకిషోర్ 40 పరుగులు చేశారు. విజయం సాధించిన ఏ జట్టును కోచ్ నజీర్, సీనియర్ క్రీడాకారుడు రేవంత్, సాయి ప్రణీత్, కౌశిక్ అభినందించారు.

రేపు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

కొత్తచెరువు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలపై మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలకు సంబంధించి పలు డిమాండ్లపై ఈ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని పెన్షనర్లందరు ఈ ధర్నాకు తప్పక హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

వైసీపీలో అంతర్గత విభేదాలు

నల్లచెరువు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఆదివారం వైసీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మగ్బుల్‌బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేజర్ సర్పంచ్ పంచరత్నమ్మకు, జడ్పీటీసీ బసిరెడ్డి అనితమ్మకు ఆహ్వానం అందకపోవడాన్ని స్థానిక సర్పంచ్ పంచరత్నమ్మ ఖండించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులైన దశరథనాయుడు, బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డికి కూడా ఆహ్వానం అందకపోవడం, ఎస్సీకి చెందిన మహిళననే తనను రాజకీయంగా అణగదొక్కుతున్నారని అన్నారు. వర్గాలను ప్రోత్సహిస్తున్న కొంత మంది నాయకులను ఆదరిస్తున్నారని చెప్పారు. ఇలాగే పార్టీ ముందుకెళితే స్థానిక ఎన్నికలల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

జలధికి తరలిన పీర్లు


చిగిచెర్లలో జలధికి వెళుతున్న పీర్లు

ధర్మవరంరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చిగిచెర్ల గ్రామంలో మొహర్రం సందర్భంగా కొలువుదీరిన పీర్లు ఆదివారం జలధికి తరలివెళ్లాయి. ఉదయం పీర్లు భేటీ తీసుకున్నాయి. సాయంత్రం జలధికి తరలించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెద్దిరెడ్డిగారి శివారెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డిగారి ప్రభాకర్‌రెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాడిమర్రిలో...

● తాడిమర్రి: మండల కేంద్రమైన తాడిమర్రిలో చిన్నపీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ముజావర్లు ఆలీ తదితరుల ప్రత్యేక ప్రార్థనల అనంతరం పీర్లకు చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.


వేపరాలలో కొలువుదీరిన పీర్లు

● గాండ్లపెంట: మండలంలోని వేపరాల పంచాయతీలో శనివా రం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి, ప్రార్థనలు చేశారు. గ్రామంలో ఊరేగించి, అగ్ని గుండం వద్ద అల్లావు తొక్కారు. చక్కెర చదివింపులు చేశారు. అలాగే మల్లమీదపల్లి పంచాయతీలోని సామచేనుపల్లిలో ఆదివా రం పీర్లకు జలధి నిర్వహించారు.


తిప్పయ్యగారిపల్లిలో..

● నల్లమాడ: మండలంలోని తిప్పయ్యగారిపల్లి, రెడ్డిపల్లి, నల్లశింగయ్యగారిపల్లి, పెమనకుంటపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం పీర్లకు జలధి నిర్వహించారు. వారం రోజుల నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి అగ్నిగుండం వెలిగించి, ఆదివారం పీర్ల జలధి నిర్వహించారు.


నంబులపూలకుంటలో జలధికి తరలుతున్న పీర్లు

● నంబులపూలకుంట: మండలకేంద్రంతో పాటు వంకమద్ది గ్రామంలో ఆదివారం ఘనంగా జలధి నిర్వహించారు. మొహరం సందర్భంగా చావిడిలో పీర్ల కొలువుదీరిన ప్పటి నుంచి రోజుకొకటి ప్రకారం చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, దుత్తల కార్యక్రమం అనంతరం జలధికి తరలివెళ్లాయి. మండలప్రజలతో పాటు పక్క మండలాల ప్రజలు అధికసంఖ్యలో తరలి వచ్చారు.


ముదిగుబ్బలో...

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతవూరులో ఆదివారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. ఉదయం పీర్లకు చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను దిగుడు భావి వద్దకు జలధికి తరలించారు. ఎన్నో ఏళ్ల తరువాత పాతవూరిలో పీర్లను కొలువు దీర్చడంతో పెద్ద ఎత్తున మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బొమ్మలు, గాజుల దుకాణాలు వెలిశాయి.


ఇనగలూరులో అగ్నిగుండం వద్ద అలావు తొక్కుతున్న యువత

● ఓబుళదేవరచెరువు: మొహర్ర సందర్భంగా ఆదివారం ఇనగలూరు, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో పీర్ల జలధిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించి జలధికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అనుమానిత వ్యక్తుల బైండోవర్

కదిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ లాడ్జీల తనిఖీలో అనుమానాస్పదంగా ఉన్న ఎనిమిది మందిని గుర్తించి, వారిని బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని లాడ్జీలను తనిఖీ తనఖీ చేస్తుండగా ఓ లాడ్జిలో ఎనిమిది మంది కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. వారి వద్ద సెల్‌ఫోన్లలో గుప్తనిధు లకు సంబంధించిన ఫొటోలు ఉన్నాయన్నారు. వారందరి వేలిముద్రలు సేకరించి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు చెప్పారు.

'ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్య లను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా కా ర్యదర్శి కమతం ఆది బయ్యన్న మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యా యులకు వెంటనే పీఆర్సీ, పెడింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలను ఇచ్చి, వారి జీతాలకు జమ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా చూడాలని డిమాడ్‌చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు నారాయణ, జనార్దన్, నారాయణ, రమణారెడ్డి, రాజశేఖర్, శ్రీవాణీ, మహబూబ్‌బాషా, రామమోహన్, నరసింహనాయక్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకాలను అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం



బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

రొళ్ల, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్యాడిగెర గ్రామంలో కాలువ రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో రథోత్సవానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ

అగళి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధూడి గ్రామంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మీ దేవాలయంలో ఆదివారం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొల్లాపురి మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పూలతో అమ్మవారిని అలంకరించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, కుమారస్వామి, శివకుమార్, రమేష్, శిల్పకెంచుయాదవ్; కల్లప్ప పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్



గెలుపొందిన జట్టుతో అనిల్‌కుమార్

హిందూపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం నింకంపల్లివద్ద టీడీపీ నాయకులు ఫాజిల్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గెలుపొందిన జట్టుకు రూ.20వేలు నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డైమండ్‌బాబా, ఫాజిల్, జబీ, అఖీబ్, షౌకత్, అల్తాఫ్, సాదిక్, అమాన్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి: సీపీఐ




కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని నాయకులు బాలాస్వామి, రాజగోపాల్ కోరారు. ఆదివారం పాత హైస్కూల్ ఆవరణలో అనుబంధ సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల తరఫున అనేక పోరాటాలు చేసి వారికి అండగా నిలబడటం జరిగిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో తమదైన పాత్రనుపోషించి నేటికీ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉందన్నారు. ఈనెల 31న జరిగే జిల్లామహాసభకు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాష, చీల నారాయణస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ నర్సింగప్ప



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

పెనుకొండ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎలాంటివారినైనా ఉపేక్షించేది లేదని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు. ఆదివారం సమస్యాత్మకమైన శెట్టిపల్లి గ్రామంలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఎవరి పనులు వారు చేసుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ

అమరాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే శివరం గ్రామంలో ఆదివారం చెరువు సంఘం అధ్యక్షుడు వీరమల్లప్ప, జనసేన పంచాయతీ క న్వీనర్ శివకుమార్, డాక్టర్ ధనుంజయ ఆ ధ్వర్యంలో వికలాంగుడికి ట్రై సైకిల్ ను ఆదివారం పంపిణీ చేశారు.

దొంగలముఠా పార్టీ వైసీపీ

మంత్రి సవిత విమర్శ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): దారుణమైన దొంగల ముఠా పార్టీ వైసీపీ అని మంత్రి సవిత విమర్శించారు. ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పట్టణంలోని 15, 16వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు మంత్రి వివరించారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఉన్న విద్యార్థులకు ఇవ్వడంతో మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కల్పించినట్లు అయ్యిందన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సుప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభంకానుందన్నారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్‌లు బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, నాయకులు ఎగువగడ్డ క్రిష్ణమూర్తి, షౌకత్, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, సమీ తదితరులు పాల్గొన్నారు.

ఏ రంగంలో రాణించాలన్నా చదువు ముఖ్యం

గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కేతః ప్రభాకర్

ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత



ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారితో నాయకులు

హిందూపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఏ రంగంలో రాణించాలన్నా చదువుముఖ్యమని గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కెతః ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం హిందూపురంలోని ఈడిగ భవన్‌లో ఆర్యఈడిగ గౌడసంక్షేమం ఆధ్వర్యంలో ఈ యేడాది టెన్త్, ఇంటర్ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా ఉత్తమ మార్కులు సాధించిన ఈడిగ కులానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన గురుమూర్తి, కేతః ప్రభాకర్ మాట్లాడుతూ హిందూపురంలో 1988లో దేమకేతేపల్లి ఈడిగ అంజినప్ప ఫౌండర్‌గా ప్రారంభించి తరువాత కాలంలో దాతల సహకారంతో వసతిగృహం నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 2020లో ఫంక్షన్‌హాల్ నిర్మించరన్నారు. ఈడిగ కులస్థులు, పిల్లలను మంచి చదువులు చదివించి ఉన్నత స్థానాలకు చేరుకునేలా చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కూడా మొబైల్ ఫోన్ వాడకం తగ్గించి లక్ష్యంతో చదివి తల్లిదండ్రులకు, కులానికి, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో ఈడిగ కులస్థులు ఎవరూ పేదరికంతో బాధపడకూడదని అందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా 133మంది విద్యార్థులకు రూ.11లక్షలు నగదు పురస్కారాలు మొమెంటోలు అందజేశారు. ఈడిగ కులస్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారంగా టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు రూ.లక్ష అందజేశారని వచ్చేయేడాది ఈడిగ కులానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటిన వారికి రూ.10లక్షలు అందజేస్తామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హామీఇచ్చినట్లు కులసంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈడిగ కులసంఘం నాయకులు రామక్రిష్టప్ప, శేఖర్, దేమకేతేపల్లి వెంకటనారాయణప్ప, ఫుల్లారెడ్డి, చిన్నప్పయ్య, సర్పంచ్ తిరుమలేష్, రిటైర్డ్ డీఈఓ మునయ్య, దేవేంద్రప్ప, కౌన్సిలర్ మల్లికార్జున, కోడూరు సోమశేఖర్, లక్ష్మీనరసప్ప, రవీంద్రనాథ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

చిలమత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హిందూపురంలో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమానికి వస్తున్న ఆయనకు బాగేపల్లి టోల్ గేటు వద్ద గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఈడిగ సోమశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, కురుబ చంద్రశేఖర్, కోడూరు సింగిల్ విండో అధ్యక్షులు నాగార్జున, ఈడిగ వెంకటసుబ్బయ్య పూలమాలలతో సత్కరించారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా టీడీపీలోనే న్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు రాష్ట్ర చైర్మన్ సూచించారు.

నేడు రైతులకు అవగాహన

మడకశిర టౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): సోలార్‌పార్క్ ఏర్పాటుపై సోమవారం ఉదయం 10 గంటలకు బుళ్ల సముద్రం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో సోలార్ పార్క్‌ను మడకశిర మండల పరిధిలోని సి.కోడిగేపల్లి, బుళ్లసముద్రం, హరేసముద్రం, వై.బి.హళ్లి, కల్లుమర్రి, మణూరు తదితర గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధిలో చేయడంలో భాగంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సంస్థ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

అమ్మవార్లకు బోనాలు

ధర్మవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసేపేటలో ఉన్న శాంతకళా చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గమ్మకు ఆదివారం బోనాలను సమర్పించారు. వంద మంది మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా దుర్గమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఆషాఢ మాసంలో దుర్గమ్మకు బోనాలను సమర్పిం చామని వారు తెలిపారు.

రేషన్ కార్డులకు దరఖాస్తుల వెల్లువ

కార్డుల కోసం ఎదురుచూపు



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

మడకశిర రూరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డు నిత్యావసర సరుకులకే కాకుండా ప్రభుత్వ పథకాలకు తప్పనిసరి. రేషన్ కార్డు లేదంటే పథకాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. దీంతో మండలవ్యాప్తంగా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో 26,900 రేషన్ కార్డులు ఉన్నాయి. మండలవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల కోసం అత్యధికంగా 3,700 దరఖాస్తులు వచ్చాయి. కార్డులో సభ్యులను చేర్పించడం, సభ్యులను తొలగించడం, కార్డు విభజన, చిరునామా మార్పు, కార్డుల సరండర్ తదితరవాటికి సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్నవారు తమకు కార్డులు ఎప్పుడు వస్తాయా..? అని ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా కొత్త రేషన్ కార్డుల కోసం 3,700 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో చాలామంది కార్డుల్లో విభజన, కొత్త కార్డులకు దరఖాస్తులు అధికంగా వచ్చాయన్నారు. కొన్ని దరఖాస్తులు ఆధార్ కార్డు సమస్యలు ఉన్న వాటిని పరిశీలిస్తున్నాం.

ఇంట్లో చోరీ

రూ.50వేలు నగదు, రూ.30వేల విలువచేసే పూజాసామగ్రి అపహరణ

పెనుకొండ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లిలో చోరీ జరిగినట్లు కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. మునిమడుగు గ్రామంలో రజిని, రాజశేఖర్ దంపతులు ఉంటున్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఆదివారం భర్త పొలానికి వెళ్లగా భోజనం తీసుకుని భార్య వెళ్లింది. ఈ సమయంలో దుండగులు ఇంటిలోకి ప్రవేశించి రూ.50వేల నగదు, రూ.30వేలు విలువచేసే పూజాసామగ్రిని ఎత్తుకెళ్లారు. రజని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

యువకుడికి గాయాలు

గోరంట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ఈ సంఘటనలో యువకుడు అశోక్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. గొల్లపల్లికి చెందిన అశోక్‌కుమార్ ద్విచక్రవాహనంపై గ్రామసమీపంలోని నాలుగురోడ్లకూడలికి వెళ్తుండగా కదిరి నుంచి రెడ్డిచెరువు కట్టమీదుగా బూదలి వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో అశోక్‌కుమార్ తలకు బలమైన గాయం కాగా, వెంటనే అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్సలు చేసి మెరుగైన చికిత్సకోసం 108లో హిందూపురం తరలించారు.

మహిళ ఆత్మహత్య

పరిగి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టగూర్లపల్లిలో ఉప్పర మంజుల(22) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నాలుగు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన జయచంద్రతో వివాహమయింది. ఆమె తరచూ కడుపునొప్పితో బాధపడుతూ నయం కాకపోవడంతో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

జలధికి తరలిన పీర్లు



జలధికి తరలుతున్న పీర్లు

గోరంట్ల, జూలై13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం, గంగంపల్లి, పెరుమాళ్లపల్లి, మలసముద్రం గ్రామాల్లో ఆదివారం జలధి ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్దపీర్లను అలంకరించి పూజలు చేశారు. అగ్నిగుండం ఏర్పాటుచేసి వేడుక చేస్తూ చివరిరోజు పీర్ల ఊరేగింపు చేశారు. అనంతరం జలధి నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శేఖర్ బందోబస్తు నిర్వహించారు.

పరిగి, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పీర్ల ఊరేగింపు సందర్భంగా భక్తులు చక్కెర చదివించుకున్నారు. అనంతరం జలధి నిర్వహించారు. ఎస్ఐ రంగడు, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఆర్గనైజర్ కొండారెడ్డి, నర్సారెడ్డి, నారాయణరెడ్డి, జూలారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా లేపాక్షిలోని గలిబిపల్లి, మామిడిమాకులపల్లి గ్రామాల్లో జలధి నిర్వహించారు. పెనుకొండలోని కొండాపురంలో మొహర్రం సందర్భంగా అగ్నిగుండం ఏర్పాటు చేసి అలావు తొక్కారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

ఆర్థికసాయం అందజేత

గుడిబండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతరాయప్ప మృతిచెందారు. విషయం తెలుసుకున్న నాయకులు పురుషోత్తం, రాజేంద్ర, గిరీష్ ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఏడాదిలోనే అభివృద్ధి

సుపరిపాలనకు తొలిఅడుగులో టీడీపీ నాయకులు



హిందూపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 33వ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తెలియజేశారు. రవి నాయక్ మాట్లాడుతూ ఏడాదికాలంలో నియోజకవర్గం, పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎంతో చేశారన్నారు. సూపర్-6 పథకాలు ఒక్కొక్కటే అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మన్సూర్, ఖాన్, జహీర్‌అహ్మద్, మహబూబ్‌బాష, గోపీ, రవిచంద్ర, బుసప్రసాద్ పాల్గొన్నారు.

పరిగిలో...



పరిగి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరించారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, డీఎస్ఎల్ శ్రీనివాసులు, పంచాయతీ అధ్యక్షుడు తిప్పేస్వామి, పొళ్యం చంద్ర, గంటా శ్రీనివాసులు పాల్గొన్నారు.

రొద్దంలో...



రొద్దం, (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించడానికే సుపరిపాలన తొలి అడుగు నిర్వహిస్తున్నామని టీడీపీ నాయకుడు మాధవనాయుడు అన్నారు. ఆదివారం రొద్దంలో సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాలు అందకపోతే వాటికి పరిష్కారం చూపుతామని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పవన్, బీసీసెల్ జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, సిద్దన్న, నరహరి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో..



సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఏడాది పరిపాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. సోమందేపల్లి, పందిపర్తి, బ్రాహ్మణపల్లి, రంగేపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ, సూర్యనారాయణ, చిన్ననరసింహులు పాల్గొన్నారు.

గుడిబండలో...



గుడిబండ, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యం అవుతుందని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని భైరేపల్లి గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి అందజేసి సంక్షేమ పథకాలను వివరించారు.

నందరాజనపల్లిలో..



అగళి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందరాజనపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ లింగన్న, మాజీ ఎంపీటీసీ మల్లేష్ కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

గణేహళ్లిలో..



అమరాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుణేహళ్లి గ్రామంలో ఏడాదిపాలనపై టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మైనార్టీ నాయకులు దాదాపీర్ కరపత్రాలు అందించి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు రామచంద్రప్ప, కృష్ణమూర్తి, కృష్ణప్ప, కుమారస్వామి, మీసాల రామచంద్రప్ప, దయానంద పాల్గొన్నారు.

రొళ్లలో...



రొళ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హొట్టెబెట్ట గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగును టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప, రవి పాల్గొన్నారు.